GSTIN-NO:36FKPSI308PIZX
epaper:tmedia.net.in

# టి-మీడియా


సామాజికం... ప్రజల పక్షం

మెయిన్

సంపుటి : 7 | సంచిక : 347 | ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ | గురువారం 26.06.2025 | పేజీలు : 3

## రూ.3కోట్ల విలువైన ఏనుగు దంతాలు


- ఎస్వోటీకి చిక్కిన నిందితుడు




**టీ మీడియా,జూన్ 25,హైదరాబాద్ బ్యూరో :** ఏనుగు దంతాలు స్మగ్లింగ్ చేస్తున్న అంతరాష్ట్ర ముఠా రాచకొండ పోలీసులు పట్టుబడింది. ఆంధ్రప్రదేశ్ నుంచి హైదరాబాద్‌కు బస్సులో తీసుకొస్తుండగా పక్కా సమాచారంతో తనిఖీలు చేపట్టి నిందితుడిని పట్టుకున్నట్లు రాచకొండ సీపీ సుధీర్‌బాబు తెలిపారు.నిందితుడి నుంచి 5.62 కిలోలున్న రెండు ఏనుగు దంతాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీటి విలువ దాదాపు 3కోట్ల రూపాయలు ఉంటుందని వెల్లడించారు. తిరుపతి శేషాచలం అడవుల్లో ఉన్న ఏనుగుల నుంచి ఈ దంతాలు సేకరించినట్లు పోలీసులు గుర్తించారు. దంతాలు నిజమైనవా కావా అని అటవీ శాఖ ఆధ్వర్యంలో తనిఖీ చేయించామన్నారు. నిందితులపై వైల్డ్ లైఫ్ యాక్ట్ 1972 కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. ఏనుగు నుంచి దంతాలు కట్ చేసి తీసుకున్నట్లు గుర్తించామన్నారు.ఏనుగు దంతాలు స్మగ్లింగ్ చేస్తున్న అంతరాష్ట్ర **ముఠా - గతంలో ఎర్ర చందనం స్మగ్లింగ్**

ముఠాలోని కీలక నిందితుడు ప్రసాద్‌ను అరెస్ట్ చేసినట్లు తెలిపిన పోలీసులు మరో నిందితుడు లోకేశ్వర్ పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. నిందితులిద్దరూ గతంలో ఎర్రచందనం స్మగ్లింగ్ కేసులో అరెస్టై జైలు జీవితం గడిపినట్లు పోలీసులు తెలిపారు. ఆపై వీరిద్దరూ కలిసి ఏనుగు దంతాల స్మగ్లింగ్?కి పాల్పడి నగరానికి తీసుకొస్తుండగా పక్కా సమాచారంతో పట్టుకున్నామని కమిషనర్ వెల్లడించారు.






# తెలంగాణ బోనాలకు...
# 600 ఏళ్ల చరిత్ర

- వేడుకలకు సర్వం సిద్ధం -
- నేటి నుండిగోల్కొండ కోటలో ఆరంభం
- హైదరాబాద్ నగరంలో ఆధ్యాత్మిక శోభ

**టీ మీడియా,జూన్ 25,హైదరాబాద్ బ్యూరో :** అమ్మల గన్న అమ్మ, ఆది పరాశక్తి, గ్రామ దేవతగా కొలువై ప్రజలను కాపాడే తల్లులకు చేసే జాతర. డిల్లం డల్లం మోతలు పోతురాజుల కాళ్ల గజ్జెలు ఘల్లుమనగా ఊరూ వాడా పులకరిస్తూ చేసే పండుగ. శివసత్తుల విన్యాసాలు, పసుపు బండారులు, పసరు వేపల సువాసనల నడుమ కల్లు సాకలు పోసి అమ్మకు పెట్టే భోజనం. నువ్వు పెద్దపులి ఎక్కినావమ్మో అంటూ అంతా కలిసి ఆడుతూ పాడుతూ చేసే ఆ వేడుకే బోనాల జాతర. దశాబ్దాల చరిత్ర కల్గిన బోనాల జాతర తెలంగాణ సంస్కృతిలోనే ఓ భాగమైంది. ప్రకృతికి, ప్రజల జీవన విధానానికి ప్రతీకగా నిలిచింది. ఈ పండుగలోనే ప్రత్యేకమైన భాగ్యనగర బోనాల జాతర రానే వచ్చింది. గురువారం వేడుకలు ఆరంభం కానుండగా ఆషాఢ మాసమంతా హైదరాబాద్‌లో సంబరాలు అంబరాన్ని అంటనున్నాయి.

## నాపై నమోదైన కేసు కొట్టేయండి

- హైకోర్టులో జగన్ క్వాష్ పిటిషన్

**టీ మీడియా,జూన్ 25,అమరావతి బ్యూరో :** సింగయ్య మృతి కేసులో వైఎస్సార్సీపీ అధ?్యక్షుడు జగన్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసుతో తమకు సంబంధం లేదంటూ తనపై నమోదైన కేసును కొట్టేయాలని కోరుతూ హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ పై రేపు (గురువారం) విచారిస్తామని న్యాయస్థానం తెలిపింది. పల్నాడు జిల్లా రెంటపాళ్ల పర్యటన సందర్భంగా గుంటూరులో ర్యాలీ నిర్వహించగా ఏటుకూరు బైపాస్ ఆంజనేయస్వామి విగ్రహం వద్ద జగన్ ప్రయాణిస్తున్న వాహనం కింద నలిగి సింగయ్య మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. సింగయ్య మృతి కేసులో జగన్ A-2గా ఉన్నారు. జగన్‌తో పాటు మాజీ మంత్రులు, వైఎస్సార్సీపీ నేతలు పేర్ని నాని (ఏ5), విడదల రజిని (ఏ6) లను నిందితులుగా పోలీసులు పేర్కొన్నారు. ఇప్పటికే పేర్ని నాని, విడదల రజనిలు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలన్నీ కలిపి హైకోర్టు గురువారం విచారణ జరపనుంది.



### వైఎస్ జగన్‌కు నోటీసులు

సింగయ్య మృతి కేసులో మాజీ సీఎం వైఎస్ జగన్‌కు పోలీసులు మంగళవారం నోటీసులు ఇచ్చారు. ఈ కేసులో పోలీసులు జగన్‌ను ఏ2 నిందితుడిగా చేర్చారు. ఈ మేరకు నోటీసులు ఇచ్చేందుకు తాడేపల్లిలోని వైఎస్సార్సీపీ కార్యాలయానికి నల్లపాడు పోలీసులు మంగళవారం వెళ్లారు. కార్యాలయ కార్యదర్శి అప్పిరెడ్డి నోటీసులు అందుకున్నారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని నల్లపాడు పోలీసులు తమ వెంట తీసుకెళ్లారు.

### సింగయ్య మృతికి జగన్ వాహనమే కారణం

ఈ కేసులో ఏ1గా కారు డ్రైవర్ రమణారెడ్డి, ఏ2గా జగన్, ఏ3గా కారు యజమానిని పేర్కొంటూ పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రమాదానికి కారణమైన వాహనం ఫార్చ్యూనర్ ఏపీ 40 డీఎస్? 2349గా గుర్తించారు. కారును వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పేరు మీద కొనుగోలు చేసి ప్రతినిధిగా జగన్ ఓఎస్?డీగా పనిచేసిన కృష్ణ మోహన్?రెడ్డి పేరు పెట్టినట్లు పోలీసుల విచారణలో తేలినట్లు తెలుస్తోంది.

### వీడియో రూపంలో వెలుగులోకి

ఈ నెల 18న వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పల్నాడు జిల్లా రెంటపాళ్ల పర్యటనలో గుంటూరులో ర్యాలీ సందర్భంగా జరిగిన రోడ్డు ప్రమాదంలో సింగయ్య మృతికి జగన్ వాహనమే కారణమనే విషయం వీడియో రూపంలో వెలుగులోకి వచ్చింది. ప్రమాదానికి సంబంధించి వైరలైన వీడియోలో జగన్ ప్రయాణిస్తున్న వాహనం కిందే మృతుడు పడినట్లు స్పష్టంగా కనిపిస్తోంది. ఏటుకూరు వద్ద ఆయన కాన్వాయ్ హైవే నుంచి సర్వీసు రోడ్డులోకి మలుపు తిరిగే ప్రదేశంలో వైఎస్సార్సీపీ కార్యకర్తలు జగన్ ప్రయాణిస్తున్న వాహనం ముందుభాగంలో ఎక్కి బీభత్సం సృష్టించారు.

మిగతా 3లో..

## విమాన ప్రమాదంలో 275 మంది మృతులు

- పూర్తి స్థాయి దర్యాప్తు జరుపుతోందన్న రామ్మోహన్

**టి మీడియా, జూన్ 25,ఢిల్లీ బ్యూరో :** గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఇటీవల జరిగిన ఘోర ఎయిరిండియా విమాన ప్రమాదంలో 275 మంది చనిపోయారు. అందులో 241 మంది ప్రయాణికులు ఉండగా, 34 మంది స్థానికులు ఉన్నారు. ఈ మేరకు గుజరాత్ అధికారులు తాజాగా వెల్లడించారు. ప్రమాద ఘటనలో ప్రాణనష్టానికి సంబంధించి రాష్ట్ర ఆరోగ్యశాఖ తొలిసారి అధికారికంగా వివరాలను ప్రకటించింది.అయితే ఘటనలో చనిపోయిన వారి మృతదేహాలను అధికారులు ఇప్పటికే స్వాధీనం చేసుకున్నారు. డీఎన్ఏ పరీక్షలు నిర్వహిస్తున్న వారు, ఇప్పటివరకు 260 మందిని గుర్తించారు. మరో ఆరుగురిని మాత్రం ముఖాలతో నిర్ధరించారు. చనిపోయిన వారిలో 120 మంది పురుషులు, 124 మంది మహిళలు, 16 మంది చిన్నారులు ఉన్నారు. ఇప్పటివరకు 256 మృతదేహాలను బాధిత కుటుంబ సభ్యులకు అప్పగించగా, మిగతావారిని గుర్తించే ప్రక్రియ కొనసాగుతోందని తాజాగా అధికారులు తెలిపారు.మరోవైపు, మరోవైపు ప్రమాదానికి గురైన విమానంలోని అత్యంత కీలకమైన బ్లాక్‌బాక్స్‌ను విశ్లేషించేందుకు విదేశాలకు పంపించారంటూ జరుగుతున్న ప్రచారాన్ని కేంద్ర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ఖండించారు. అవన్నీ కేవలం ఊహాగానాలేనని తెలిపారు. అది భారత్‌లోనే ఉందన్నారు. ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో పూర్తిస్థాయిదర్యాప్తుజరుపుతోందనిపేర్కొన్నారు.అహ్మదాబాద్ నుంచి జూన్ 12న లండన్ బయలుదేరిన ఎయిరిండియా డ్రీమ్‌లైనర్ ఫ్లైట్ టేకాఫ్ అయిన కొన్ని క్షణాల్లోనే కుప్పకూలిపోయింది. ఘటన సమయంలో విమానంలో 242 మంది ఉండగా, 11ఏ సీటులో ఉన్న ఒక్క విశ్వాస్ కుమార్ అనే వ్యక్తి మాత్రం ప్రాణాలతో బయటపడగా మిగతా వారంతా ప్రాణాలు కోల్పోయారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వైద్య విద్యార్థుల వసతి భవనంపై విమానం పడటంతో అక్కడున్న పలువురు వైద్యులు సహా స్థానికులు మృతి చెందారు.



## తలపై కొట్టి చున్నీతో ఉరేసి చంపారు

- జీడిమెట్ల హత్యపై డీసీపీ సురేశ్

**టీ మీడియా, జూన్ 25,హైదరాబాద్ బ్యూరో:** రాష్ట్రంలోనే సంచలనం సృష్టించిన జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ మహిళ హత్య కేసును 24 గంటల్లో ఛేదించినట్లు బాలానగర్ డీసీపీ సురేష్ కుమార్ తెలిపారు. బాలానగర్‌లోని డీసీపీ కార్యాలయంలో ఇవాళ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు.

**కిడ్నాప్ కేసు పెట్టిన తల్లి :** ప్రేమ వ్యవహారానికి పదే పదే అడ్డొస్తుందని పదో తరగతి చదువుతున్న కన్న కూతురే తన ప్రియుడు, ప్రియుడి తమ్ముడితో కలిసి కన్న తల్లిని హత్య చేసిందని డీసీపీ సురేష్‌కుమార్ తెలిపారు. జూన్? 19వ తేదీన బాలిక ఇంటి నుంచి వెళ్లిపోవడంతో ఆమె తల్లి 20న జీడిమెట్ల పోలీస్ స్టేషన్‌లో కిడ్నాప్ కేసు పెట్టినట్లు వెల్లడించారు. బాలిక 20వ తేదీ రాత్రి ఇంటికి తిరిగొచ్చిందని, 23న షాపూర్‌నగర్‌లోని ఇంట్లో తల్లి(39) పూజ చేస్తుండగా పక్కా పథకం ప్రకారం చున్నీతో గొంతు నులిమి, తలపై బలంగా కొట్టి హత్యకు పాల్పడినట్లు దర్యాప్తులో తేలిందని డీసీపీ వివరించారు.మృతురాలిని ఆమె కుమార్తె(16), కుమార్తె ప్రియుడు శివ(19), శివ సోదరుడు(16) కలిసి హత్య చేశారు. ఈ అమ్మాయి వారిని ప్రోత్సహించి హత్య చేసేలా చేసింది. చున్నీ బిగించి హత్య చేశారు. బాలికకు శివకు 8నెలల క్రితం ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం ఏర్పడింది

**ప్రేమకు అడ్డొస్తుందనే :** కొన్ని నెలలుగా నిందితురాలు (కూతురు) తల్లితో గొడవ పడుతూ ఉండేదని, ప్రేమ విషయంలో అడ్డొస్తుందనే ఉద్దేశంతో తల్లిని హత్య చేసినట్లు నిందితురాలు ఒప్పుకున్నట్లు దర్యాప్తులో తేలిందన్నారు. డీజే ఆపరేటర్‌గా పనిచేస్తోన్న ప్రియుడు శివ(19) ఇన్‌స్టాగ్రామ్‌లో బాలికకు పరిచయమైనట్లు తెలిపారు. ఈ ఘటనలో ముగ్గురు నిందితులపై హత్యానేరం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీసీపీ వివరించారు.






## 3 నెలల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించండి

- ఎన్నికల సంఘానికి హైకోర్టు ఆదేశం
- తీర్పు వెలువరించిన జస్టిస్ టి.మాధవిదేవి

**టి మీడియా, జూన్ 25,హైదరాబాద్ బ్యూరో :** తెలంగాణ హైకోర్టులో స్థానిక సంస్థల ఎన్నికలపై దాఖలైన పిటిషన్లకు సంబంధించిన తుది తీర్పును న్యాయస్థానం వెలువరించింది. గ్రామ పంచాయతీ ఎన్నికలను 3 నెలల్లో నిర్వహించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. వీలైనంత త్వరగా 30 రోజుల్లో వార్డుల విభజన పూర్తిచేసి, ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల సంఘానికి సూచించింది. 6 పిటిషన్లు దాఖలు : 2024 జనవరి 31వ తేదీన సర్పంచుల పదవీకాలం ముగిసిన విషయం తెలిసిందే. గడువు ముగిసి ఒకటిన్నరేళ్లయినా ఎన్నికలు నిర్వహించకపోవడంపైన్యాయస్థానంలో 6 పిటిషన్లు దాఖలు అయ్యాయి. సర్పంచ్‌ల పరిపాలన లేక గ్రామాలఅభివృద్ధివెనుకబడుతోందని బీఆర్ఎస్, బీజేపీలు ఆరోపిస్తున్న విషయం విదితమే. గ్రామ పంచాయతీ ఎన్నికలపై తీర్పును జస్టిస్ టి.మాధవిదేవి వెలువరించారు.తొలుత పిటిషనర్ల తరఫు న్యాయవాదులు కోర్టులో వాదనలు వినిపించారు. గతేడాది జనవరి 31వ తేదీతో సర్పంచుల పదవీ కాలం ముగిసినా ఇప్పటికీ ఎన్నికలు నిర్వహించకుండా ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తోందన్నారు. సర్పంచులను తప్పించి పంచాయతీల బాధ్యతలను స్పెషల్? అధికారులకు అప్పగించడం, రాజ్యాంగానికి, తెలంగాణ పంచాయతీరాజ్ చట్టాలకు విరుద్ధం అని పేర్కొన్నారు.సొంత నిధులు వెచ్చించి : ప్రత్యేక అధికారులు వారికున్న ఇతర విధుల్లో ఉండటంతో ప్రజల సమస్యలను పట్టించుకోవడంలేదని, రాష్ట్ర ఆర్థిక సంఘం ద్వారా నిధులు సమకూరుస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీతో పలువురు సర్పంచులు తమ సొంత నిధులు వెచ్చించి అభివృద్ధి పనులు చేయించారని న్యాయస్థానానికి తెలిపారు. ప్రస్తుతం ఆ నిధులు అందక నానా అవస్థలు పడుతున్నారని, వివిధ పథకాల కింద కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు రావడం లేదని తెలిపారు. వెంటనే గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకోవాలని, లేదంటే పాత సర్పంచులకే బాధ్యతలు అప్పగించాలని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు కోరారు.

**స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల ఖరారు :** తెలంగాణ ప్రభుత్వం తరఫున వాదనలు వినిపించిన అదనపు అడ్వొకేట్ జనరల్ ఇమ్రాన్‌ఖాన్ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు ఖరారు చేసి ఎన్నికల ప్రక్రియను చేపట్టాల్సి ఉందన్నారు. ఈ ప్రక్రియ పూర్తికావడానికి కనీసం మరో నెల రోజుల సమయం అవసరమని తెలిపారు. ఈ దశలో న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ ఎన్నికల నిర్వహణపై గతంలో ఒకసారి హామీ ఇచ్చి కూడా ఎందుకు మీరు అమలు చేయలేదని ప్రశ్నించారు.ఎన్నికల సంఘం తరఫున సీనియర్ న్యాయవాది జి.విద్యాసాగర్ వాదనలు వినిపిస్తూ బీసీ రిజర్వేషన్లను ఖరారు చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని తెలిపారు. ఇది పూర్తికాగానే గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియ ప్రారంభిస్తామన్నారు. ప్రభుత్వం ఎన్నికల నిర్వహణకు ఆమోదం తెలిపిన అనంతరం ప్రక్రియ పూర్తి చేయడానికి మరో రెండు నెలల సమయం పడుతుందన్నారు.

### రిజర్వేషన్ల ఖరారుతో పాటు


దీనిపై న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ సకాలంలో ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే స్టేట్ ఎలక్షన్ కమీషన్ చొరవ తీసుకోవాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసినందున ఆ దిశగా ఎందుకు చర్యలు తీసుకోలేదని అడిగారు. దీనికి న్యాయవాది సమాధానమిస్తూ రిజర్వేషన్ల ఖరారుతో పాటు ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లు చేయాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వానిదేనన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి వచ్చే మూడు నెలల్లో గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని తీర్పును వెలువరించారు.

## గర్భిణులు, వృద్ధులకు... ఆటో ఫ్రీ

3లో..

# మత్తు పదార్థాల రహిత జిల్లాగా తీర్చిదిద్దుతాం

**జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ప్రతిజ్ఞ**



**టీ మీడియా, జూన్ 25, వనపర్తి బ్యూరో :** ఈనెల 26న అంతర్జాతీయ మాదకద్రవ్యాల నియంత్రణ దినోత్సవ సందర్భంగా వనపర్తి జిల్లా కేంద్రంలో డ్రగ్స్ నియంత్రణ కోసం పోలీసులు చేస్తున్న కృషిని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ప్రజలను ముఖ్యంగా యువకులను చైతన్యం చేస్తూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని చేపడుతున్న బహుత్తర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ప్రజలకు పిలుపునిచ్చారు. 2027 సంవత్సరం నాటికి మత్తు పదార్థాల నిషేధిత జిల్లాగా వనపర్తిని తీర్చిదిద్దడమే తమ ఏకైక లక్ష్యమని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. . మత్తు పదార్థాల అక్రమ రవాణా మాదకద్రవ్యాల వినియోగం వంటి వాటిపైన ఈనెల 26న వనపర్తి జిల్లా కేంద్రంలో జేవస్ రాములు ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన వాల్ పోస్టర్ ను జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ విడుదల చేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా పాల్గొని ప్రపంచవ్యాప్తంగా దేశవ్యాప్తంగా డ్రగ్స్ నిర్మూల కోసం మత్తు పదార్థాల రహిత దేశంగా ఈ భారతదేశాన్ని ముందుకు నడిపించవలసిన బాధ్యతగల యువత ముందుండాలని ఆయన పిలుపునిచ్చారు. యువత లేనిది ఈ దేశ భవిష్యత్తు లేదని ఈ విషయం పైన యువత మత్తు పదార్థాలతో పాటు శాంతి భద్రతల విషయంలో కూడా చట్టాలను అవగాహన పెంచుకొని భావి భారత పౌరులుగా ఈ దేశానికి సందేశాన్ని ఇవ్వవలసిన బాధ్యత గల యువతరం అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ యువకులకు పిలుపునిచ్చారు. గంజాయి డ్రగ్స్ అలవాటు వల్ల శారీరక మానసిక ఆరోగ్యంగా అన్ని విధాల జీవితాన్ని చిత్తు చేస్తుందని ఎస్పీ అన్నారు. చెడు అలవాట్లకు యువత దూరంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. మత్తు పదార్థాల నివారణ కోసం యాంటీ డ్రగ్స్ కమిటీలో సభ్యులుగా చేరి యాంటీ డ్రగ్స్ సోల్జర్ గా ప్రతి ఒక్కరూ యువత సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. జిల్లాలో డ్రగ్స్ వంటి మతపదార్థాల అమ్మకదారుల పైన కేసులు నమోదు చేశామని రాబోయే రోజుల్లో కూడా ఇలాంటి కేసులు చేయడమే కాకుండా చట్టపరమైన చర్యలు తీసుకుంటూ నిందితులకు భవిష్యత్తులో ఎక్కడ పుట్టగతులు లేకుండా చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిసిఆర్బి ఇన్చార్జి ఎస్పి ఉమా మహేశ్వరరావు,రిజర్వ్ ఇన్స్పెక్టర్ అప్పలనాయుడు, ఏ హెచ్. టి యు ఎస్సై అంజద్, నిర్వాహకులు జే సతీష్ రాజు, మహిమ రాజు, సంతోష్, రాజు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు : జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



**టీ మీడియా, జూన్ 25, వనపర్తి బ్యూరో :** వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని వనపర్తి జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో వైద్య శాఖ అధికారులతో సీజనల్ వ్యాధులు, టి.బి నిర్మూలన, ఎ.ఎన్.సి నమోదు, పి.హెచ్.సి లలో ప్రసవాల సంఖ్య పెంచటం పై సమీక్ష నిర్వహించారు. వర్షాకాలంలో దోమలు వ్యాప్తి చెంది డెంగ్యూ, మలేరియా, చికెన్ గునియా వంటి వ్యాధులతో పాటు డయేరియా కేసులు పెరిగే అవకాశం ఉంటుందని అందువల్ల వీటిని అరికట్టడానికి పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎక్కడైతే గత సంవత్సరం డెంగ్యూ , మలేరియా, చికెన్ గునియా కేసులు నమోదు అయ్యాయో అక్కడ ముందస్తు నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫ్రైడే ఫ్రైడే పకడ్బందీగా నిర్వహించడమే కాకుండా దోమల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. పాము కాటు, కుక్క కాటు వంటి ప్రమాదాలు జరిగినప్పుడు చికిత్సలు అందించే విధంగా మందులు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. క్షయ వ్యాధిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని, దగ్గు, జ్వరం లక్షణాలు ఉన్న ప్రతి ఒక్కరికి నాట్ పరీక్షలు నిర్వహించాలని అదేవిధంగా ఇప్పటికే గుర్తించిన 567 మంది వ్యాధిగ్రస్తులకు క్రమం తప్పకుండా మందులు వేసుకునే విధంగా చూడాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఎ.ఎన్.సి నమోదులు పెరిగే విధంగా చూడాలని అదే విధంగా ఏ.ఎన్.సి నమోదులు సకాలంలో జరిగే విధంగా చూడాలని ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ప్రసవాల సంఖ్యను పెంచాలని పేద గర్భిణులకు ప్రైవేట్ హాస్పిటల్ లో కాకుండా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు జరిగే విధంగా అవగాహన కల్పించాలన్నారు.వనపర్తి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న కంటి శస్త్ర చికిత్స కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి. వనపర్తి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో కంటి శస్త్ర చికిత్స కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని ఇందులో క్యాటరాక్ట్ సర్జరీలు ఉచితంగా నిర్వహించడం జరుగుతుందని దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకునే విధంగా చూడాలని ఆదేశించారు. ఇప్పటివరకు ఈ ఆసుపత్రిలో దాదాపు 50 నుండి 60 శస్త్ర చికిత్సలు జరిగాయని, ఎలాంటి ఫిర్యాదులు నమోదు కాలేదని తెలియజేశారు.జిల్లా వైద్యాధికారి డా. శ్రీనివాసులు, మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్, ప్రభుత్వ వైద్యశాల సుపరిండెంట్ డా. రంగారావు, ప్రోగ్రాం ఆఫీసర్లు ఆఫీసర్లు డా. సాయినాథ్ రెడ్డి డాక్టర్ పరిమళ, సి. హెచ్.సి నుండి డా. చైతన్య , మెడికల్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

## జూరాల ప్రాజెక్టుకు 92,000 క్యూసెక్కుల నీరు రాక



**టీ మీడియా ,జూన్ 25, ఆత్మకూరు:** వనపర్తి జిల్లా జూరాల ప్రాజెక్ట్ కు భారీగా కొనసాగుతున్న వరద కొనసాగుతున్నది. కర్ణాటక రాష్ట్రం నుంచి ఈ భారీ వరద వస్తుంది జూరాల ప్రాజెక్టు13 గేట్లు ఎత్తి 85,805 క్యూసెక్కులు నీరు విడుదల చేస్తున్నారు . 13 గేట్లు పైనుండి 51,597 కిందికి వెళుతుంది. కృష్ణమ్మ శ్రీశైలం వైపు వెళుతుంది . జూరాల ప్రాజెక్టు ఇన్ ఫ్లో 92,000 క్యూసెక్కులు ఔట్ ఫ్లో : 85,805 క్యూసెక్కులు మీరు శ్రీశైలం వైపు పరుగులు తీస్తున్నాయి .జూరాల ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి సామర్థ్యం: 318.516 మీటర్లు, ప్రస్తుత నీటి సామర్థ్యం: 317.690 మీటర్లు. ప్రస్తుతం జూరాల ప్రాజెక్టులో 8.010 టీఎంసీ నీరు ఉన్నది. ప్రాజెక్టు మొత్తం సామర్థ్యం 9.657 మీటర్లు ఎగువ జూరాల జల విద్యుత్ కేంద్రాలలో 5 యూనిట్లలో సంవత్సరానికి ఇప్పటివరకు 58,121 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి అవుతుంది, దిగువ జూరాల జల ఉత్పత్తి 6 యూనిట్ల నుండి సంవత్సరానికి ఇప్పటివరకు 66,119 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి అయినది. జూరాల ప్రాజెక్టులో ప్రస్తుతం 7.914 టీఎంసీల నీరు ఉన్నదని అధికారులు తెలిపారు.

## నాణ్యమైన విద్యను అందించాలి

**౨బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు యస్.శ్రావణ్ కుమార్**



**టీ మీడియా, జూన్ 25, వనపర్తి బ్యూరో :** బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్ యాదవ్ పిలుపు మేరకు గోపాలపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత బాలుర పాఠశాలను బీఆర్ఎస్వీ కమిటీ సందర్శించి ప్రభుత్వం నుండి దుస్తువులు, పాఠ్యపుస్తకాలు సరిగ్గా అందుతున్నాయో లేదో మరియు మధ్యాహ్నం భోజనం గురించి విద్యార్థులను అడిగి తెలుసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ నాయకులు మాట్లాడుతూ చాలా ప్రభుత్వ పాఠశాలల్లో సరిపడా తరగతి గదులు, మరుగుదొడ్లు,త్రాగునీరు, ఆట స్థలాలు లేవని పాఠశాలలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించాలన్నారు.విద్యార్థుల అభ్యసనాన్ని పెంపొందించడానికి వ్యక్తిగత శ్రద్ధ తీసుకో వాలన్నారు. తల్లిదండ్రుల-ఉపాధ్యాయ సమావేశాలను ప్రోత్సహించాలని,ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని వారు అన్నారు.తల్లిదండ్రుల భాగస్వామ్యం విద్యార్థుల ప్రేరణకు కీలకమైన అంశం, కానీ చాలా ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రుల భాగస్వామ్యం తక్కువగా ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, సిబ్బంది కొరత, నాణ్యమైన విద్య, తల్లిదండ్రుల భాగస్వామ్యం వంటి సమస్యలు ఉన్నాయి. ఈ సమస్యల కారణంగా, విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల నుండి ప్రైవేట్ పాఠశాలలకు మళ్ళుతున్నారన్నారు. పాఠశాలలో సాంఘిక ఉపాధ్యాయుడు లేడని, పాఠశాలకు అటెండర్ కూడా లేదని విద్యార్థులు తెలియజేయడం జరిగింది. పాఠశాలలో నిర్మాణంలో ఉన్నటువంటి తరగతి గదులు పూర్తిస్థాయిలో నిర్మాణం చేయాలని విద్యార్థులు అన్నారు.అనంతరం పాఠశాలలోని స్టోర్ రూమ్ ను పరిశీలించడం జరిగింది. పాఠశాలను సందర్శించిన వారిలో బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు యస్.శ్రావణ్ కుమార్, మాజీ వైస్ ఎంపీపీ శేఖర్, లక్ష్మణ్ గౌడ్, శివప్రసాద్ గౌడ్, మన్సూర్, రాములు యాదవ్, భాను,అనిల్ నాయక్, మహేందర్ తదితరులు ఉన్నారు.

## మున్నూరు కాపు సంఘం రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నిక

**- సన్మానించిన బిజెపి నాయకులు**



**టీ మీడియా, జూన్ 25, వనపర్తి బ్యూరో :** బిజెపి పార్టీ సీనియర్ నాయకులు జిల్లా ఉపాధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహిస్తున్న వనపర్తి జిల్లా కేంద్రానికి చెందిన బండారు కుమారస్వామి బుధవారం ప్రకటించిన మున్నూరు కాపు సంఘం రాష్ట్ర కమిటీలో రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన సందర్భంగా భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు డి.నారాయణ బండారు కుమారస్వామిని శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేస్తూ భవిష్యత్తులో రాష్ట్రంలో అగ్రస్థాయిలో బాధ్యతలు చేపట్టాలని ఆశాభావం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి బి.శ్రీశైలం, ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రోగ్రాం కోఆర్డినేటర్ చిత్తారి ప్రభాకర్, జిల్లా అధికార ప్రతినిధి – జిల్లా మీడియా ఇన్చార్జి పెద్దిరాజు, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు గంధం ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## స్పెషల్ డ్రైవ్ నిర్వహించిన నగర పాలక సంస్థ

**డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి**



**టీ మీడియా,జూన్ 25,గోదావరిఖని :** ప్రతి వ్యాపారి తప్పనిసరిగా డి,ఓ ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలని, రామగుండం నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి అన్నారు.వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా బుధవారం ట్రేడ్ లైసెన్స్ లపై 48వ డివిజన్ లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు.ఈ సంధర్భంగా పాత మున్సిపల్ కార్యాలయం ప్రాంతంలో ఉన్న దుకాణ దారులకు అవగాహన కల్పించే కార్యక్రమం చేపట్టారు.డి,ఓట్రేడ్ లైసెన్స్ తో వ్యాపారులు పొందే ప్రయోజనాలను ఆయన వారికి వివరించారు.అలాగే వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా వివిధ చోట్ల మురుగునీటి కాలువల్లో పూడిక తీత, గోడలపై సందేశాత్మక చిత్రాలతో పెయింటింగ్స్ వేయడం తదితర పనులు కూడా కొనసాగాయి.ఈ కార్యక్రమాల్లో ఎన్విరాన్ మెంటల్ ఇంజనీర్ మధుకర్,ఎంఐఎస్ ఆపరేటర్ శ్రీకాంత్,వార్డు అధికారులు,మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

## మత్తు పదార్థాల వినియోగం నష్టాలపై అవగాహన



**టీ మీడియా,జూన్ 25,గోదావరిఖని :** ఉన్నతాధికారుల ఆదేశానుసరంగా మహాత్మ జ్యోతిరావ్ పూలే బీసీ వెల్ఫేర్ స్కూల్ లో డ్రగ్స్ నియంత్రణ వారోత్సవాలలో భాగంగా బుధవారం అవగాహన కార్యక్రమంను గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఉత్తర్వుల మేరకు గోదావరిఖని వన్ టౌన్ ఎస్ఐ భూమేష్ నిర్వహించినారు.ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ...మత్తు పదార్థాలపై విద్యార్థుల భవిష్యత్తు మరియు జీవితం నాశనం అవుతున్నాయని, మత్తు పదార్థాల వినియోగంతో కలిగే దుష్పరిణామాలను విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగింది అన్నారు.గంజాయి, మాదకద్రవ్యాలకు ఒకసారి దీనికి బానిసలు అయితే ఎలాంటి నేరాలకు పాల్పడడానికైనా వెనకాడరు.కావున విద్యార్థులందరూ చెడు అలవాటులకు అలవాటు పడకుండా,తమ భవిష్యత్తును మంచి మార్గంలో నడిపించే చదువు పైన దృష్టి పెట్టి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని సూచించారు.మేము గంజాయి,డ్రగ్స్ తీసుకోము, బంధుమిత్రులు, చుట్టుపక్కల వారు, స్నేహితులు మాధకద్రవ్యాలకు అలవాటు పడకుండా వారిని చూసుకునే బాధ్యత మాదే అని డ్రగ్స్ వల్ల కలిగే అనార్థాల గురించి వారికి వివరిస్తాం అని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేపించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు,టీచర్లు, వన్ టౌన్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## దుర్గా భవాని అమ్మవారిని దర్శించుకున్న

**-ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు**



**టీ మీడియా, జూన్ 25, వేడ్చల్:** ఏడుపాయల దుర్గాభవాని అమ్మవారిని దర్శించుకున్న మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు ఆశీర్వచనం తీసుకున్నారు. ఈకార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మిద్దెల బాల్ రెడ్డి నాయకులు జిన్నారం వెంకటేష్ గౌడ్, పోలీస్ గోవింద్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చేందుకు బాధ్యత తీసుకోవాలి

**౨ జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**



**టీ మీడియా, జూన్ 25, వనపర్తి బ్యూరో :** వనపర్తి జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతి ఒక్కరు బాధ్యత తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి పిలుపునిచ్చారు.జూన్ 20 నుంచి 26 జిల్లాలో వరకు నిర్వహిస్తున్న అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వినియోగం, నిర్మూలన కార్యక్రమంలో భాగంగ బుధవారం కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ తో కలిసి డ్రగ్స్ నిర్మూలన గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో యువత మాదక ద్రవ్యాల వినియోగం బారిన పడకుండా తల్లిదండ్రులు, అధ్యాపకులు, సమాజంలోని ప్రతి ఒక్కరు బాధ్యత తీసుకోవాలని సూచించారు. జిల్లాలో మాదక ద్రవ్యాల రవాణా జరుగకుండా పోలీస్ యంత్రాంగం గట్టి నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. మాదక ద్రవ్యాల వినియోగం, రవాణా పై జిల్లా ప్రజలకు అవగాహన కల్పించేందుకు జూన్ 26 న ఉదయం 7.00 గంటలకు స్థానిక బాయ్స్ జూనియర్ కళాశాల మైదానం నుండి పాలిటెక్నిక్ కళాశాల వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ర్యాలీలో యువత పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.జిల్లా సంక్షేమ శాఖ అధికారి సుధారాణి, పోలీస్ అధికారులు పోస్టర్ ఆవిష్కరణలో పాల్గొన్నారు.

## డిపెండెంట్లకు నియామక పత్రాలు

**-పంపిణీ చేసిన మంత్రి వివేక్**



**టీ మీడియా, జూన్ 25 మంచిర్యాల బ్యూరో :** మంచిర్యాల జిల్లా మందమర్రి ఏరియా జీఎం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మైనింగ్ కార్మిక శాఖ మంత్రి డా. వివేక్ వెంకటస్వామి 14 మంది బొగ్గగని కార్మికుల డిపెండెంట్లకు కారుణ్య నియామక పత్రాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో మందమర్రి ఏరియా జీఎం శ్రీ దేవేందర్ , ఏఐటీయూసీ అధ్యక్షుడు శ్రీ వాసిరెడ్డి సీతారామయ్య పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూబొగ్గుగని కార్మికులంటే మా కాకా గారు డా. వెంకటస్వామి కి అమితమైన ప్రేమ ఉండేది. ఆయన కేంద్ర కార్మిక మంత్రిగా ఉన్న సమయంలో, నష్టాల్లో ఉన్న సింగరేణి సంస్థ మూసివేయకుండా అప్పటి ప్రధాన మంత్రి పీవీ నరసింహారావు తో చర్చించి, ఎన్టీపీసీ నుంచి రూ.400 కోట్లు రుణం ఇప్పించి సంస్థను ఆదుకున్నారు. లక్షలాది కార్మిక కుటుంబాలకు బాసటగా నిలిచారు. సింగరేణి సంస్థ లాభాల బాటలోకి రావడానికి, కార్మికుల క్రమశిక్షణ, కష్టపడి పనిచేయడం ప్రధాన కారణం. తెలంగాణలోనే అతి పెద్ద ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణిని కాపాడుకోవడం మనందరి బాధ్యత.గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో, సంస్థ అభివృద్ధికి తగిన ప్రయత్నం జరగలేదు. కేవలం నిధుల వాడకానికే పరిమితమైంది. ఇకపై కొత్త గనులు, కొత్త ఉద్యోగ అవకాశాలు తీసుకురావడంపై దృష్టి పెడతాం. కేంద్ర ప్రభుత్వం చేపట్టే టెండర్లలో సింగరేణి సంస్థ నేరుగా పాల్గొనగలిగే విధంగా చర్యలు తీసుకుంటాం.ఈ కార్యక్రమంలో ఉద్యోగ నియామక పత్రాలు అందుకున్న కుటుంబాలు మంత్రి కి కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగావకాశం వారి జీవితాలకు మేలు చేస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

## శిష్యుని దారిలో గురువు ప్రయాణం

**౨ లా సెట్‌లో క్వాలిఫై అయిన రిటైర్డ్ హెడ్ మాస్టర్**



**టీ మీడియా, జూన్ 25, వనపర్తి బ్యూరో :** మహబూబ్ నగర్ జిల్లా విద్యావ్యాసంగానికి ఓ నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన రిటైర్డ్ హెడ్ మాస్టర్ డాక్టర్ అతీక్ అహ్మద్ , తాజాగా జరిగిన తెలంగాణ లా సెట్ 2025 పరీక్షలో ఉత్తీర్ణత సాధించడం విశేషం. 63 ఏళ్ల వయసులోనూ న్యాయ విద్య అభ్యసించాలనే ఆశయంతో, ఎంతో పట్టుదలతో పరీక్ష రాసి విజయం సాధించడం గొప్ప సాధన.38 ఏళ్ల క్రితం మహబూబ్ నగర్‌లోని క్రీస్తుజ్యోతి విద్యాలయంలో లెక్కల టీచర్ గా పనిచేసిన సమయంలో ప్రాథమిక విద్య శిష్యుడిగా విద్యను అభ్యసించిన సత్తూర్ రాఘవేందర్ గౌడ్ చదువులో రాణించి నేడు హైకోర్టులో పేరు గాంచిన ప్రముఖ న్యాయవాదిగా వెలుగొందు తున్నారు.నిజాయితీ, నిబద్ధత, సామాజిక స్పృహతో బాధిత ప్రజలకు న్యాయం చేస్తూ ఎన్నో కేసుల్లో విజయాలు సాధించి హైకోర్టులో విశేష గుర్తింపు పొందారు.అటువంటి శిష్యుని ప్రేరణతో గురువు కూడా న్యాయవాదిగా మారాలని సంకల్పించిన డా. అతీక్ అహమ్మద్ తెలంగాణ లా సెట్ ఎంట్రన్స్ పరీక్ష ఫలితాల్లో అర్హత సాధించి ఇప్పుడు ఓ మంచి లా కాలేజీ లో అడ్మిషన్ తీసుకుని న్యాయ విద్యను అభ్యసించేందుకు సిద్ధమయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ అతీక్ అహమ్మద్ మాట్లాడుతూశ్రేయోభిలాషుల ఆశీస్సులతో, అల్లాహ్ కరుణతో, ఈ వయసులోనూ న్యాయ విద్యలో అడుగు పెడుతున్నాను. భవిష్యత్తులో కోర్టుల వద్ద న్యాయ సహాయం అవసరమైన నిరుపేదలకి, న్యాయ బాధితులకి అండగా నిలిచేలా కృషి చేస్తాను. ఇది నా జీవిత లక్ష్యం.దీనికి కష్టపడి సాధించేందుకు నేను పూర్తిగా సిద్ధంగా ఉన్నాను అని తెలియజేశారు.విద్యకు వయస్సు అడ్డుకాదని, శిష్యుని మార్గం గురువుకు మార్గదర్శిగా మారిన ఈ సంఘటన ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం.గురువు %-% శిష్యుల మధ్య బంధానికి, అభ్యాసానికి, ఆశయ సాధనకు ఇది ఓ చక్కటి ఉదాహరణ.

## చిన్ననాటి స్నేహితునికి సన్మానం



**టీ మీడియా, జూన్ 25 , పెద్దపల్లి బ్యూరో :** శ్రీరాంపూర్ మండల%శీ% మొట్లపల్లి గ్రామానికి చెందిన దొమ్మటి తిరుపతి ఇటీవల టి జి పి ఎస్ సి విడుదల చేసిన హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఫలితాలలో ఉద్యోగం సాధించాడు.ఈ సందర్భంగా అతని చిన్ననాటి బాల్య మిత్రులు సన్మానించి హర్షం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో బసవత్తుల జ్ఞానేంద్రాచారి ముద్దసాని శ్యామ్ మిత్రులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇల్లు త్వరగా నిర్మించుకోవాలి


**౨ జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**



**టీ మీడియా, జూన్ 25, వనపర్తి బ్యూరో :** వనపర్తి జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు పొందిన లబ్ధిదారులు తమ ఇళ్లను త్వరగా నిర్మించుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. బుధవారం పాన్గల్ మండలంలోని మాధవరావు పల్లి గ్రామపంచాయతిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. గ్రామానికి 57 ఇళ్లు మంజూరు కాగా ఇప్పటి వరకు 36 ఇళ్లకు ముగ్గులు పోసి 17 ఇళ్లు స్లాబ్ వరకు పూర్తి అయ్యాయి. ఇళ్లను పరిశీలించిన కలెక్టర్ సంతృప్తిని వ్యక్తం చేశారు. మిగిలిన వాళ్ళు నిర్మాణం ప్రారంభించలేదు కాబట్టి వారికి రద్దు చేసి అర్హత ఉన్న ఇతరులకు సిఫారసు చేయాలని మండల అభివృద్ధి అధికారిని ఆదేశించారు. అనంతరం మాధవరావు పల్లి ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. పాఠశాలల్లో ఒకే ఉపాధ్యాయుడు ఉన్నప్పటికినీ విద్యార్థులకు నాణ్యమైన విద్యాబుద్ధులు నేర్పిస్తూ ప్రతి సంవత్సరం 5వ తరగతిలో గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలు పొందేవిధంగా చూడటం పై ఉపాధ్యాయుడు వీరస్వామి నీ కలెక్టర్ అభినందించారు. అంతకు ముందు పానగల్ గ్రామము ఎస్సీ కాలనీ అంగన్వాడి కేంద్రంలో కొత్తగా చేరిన విద్యార్థులకు కలెక్టర్ అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం పానగల్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాను సందర్శించారు. ఉపాధ్యాయులు అంకిత భావంతో విద్యా బోధనలు చేస్తే ఇలాంటి మంచి ఫలితాలు వస్తాయని కలెక్టర్ ఉపాధ్యాయులను ప్రోత్సహించారు. పదవ తరగతి అమ్మాయిలకు డిజిటల్ బోర్డు పై లెక్కలు నేర్పించారు. విద్యార్థులు అందరికీ అర్థమయ్యే వరకు లెక్కలు ఎలా చేయాలి, లాజిక్ ఎలా అర్థం చేసుకోవాలి అని బోధించారు.ఈ పాఠశాల నుండి మ్యాథమాటిక్ లో ఒక్క విద్యార్థి ఫెయిల్ కాకుండా విద్యా బోధన చేయాలని ఆదేశించారు. జిల్లా విద్యా అధికారి మహమ్మద్ అబ్దుల్ ఘని, పి.డి డిఆర్డీఓ ఉమాదేవి, జిల్లా సంక్షేమ అధికారి సుధారాణి, తహసిల్దార్ సత్యనారాయణ, ఎంపీడీఓ గోవింద రావు, మండల విద్యా అధికారి శ్రీనివాస్, ఉపాధ్యాయులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ని కలిసిన

**-మున్నూరు కాపు సంఘం**



**టీ మీడియా, జూన్ 25,మేడ్చల్:** కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద మున్నూరు కాపు సంఘం రాష్ట్ర నూతన కార్యవర్గ సభ్యులు బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి శాలువాతో సత్కరించారు.ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మున్నూరు కాపు సంఘం రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు ఎమ్మెల్యే చేతులమీదుగా నియామక పత్రాన్ని అందజేశారు.అనంతరం బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ మున్నూరు కాపు సంఘం అభివృద్ధికి తన సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నూతనంగా ఎన్నికైన బోరుబావి సత్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి కుంట సిద్ధిరాములు, జంగిటి రవి, మీడియా సెక్రెటరీ – సాయిని శ్రీనివాస్, ఉపాధ్యక్షులు పందిరి యాదగిరి, రాష్ట్ర కార్యదర్శి అప్పాల శేఖర్, రాష్ట్ర కమిటీ మెంబర్ సీహెచ్. శ్రీనివాస్, ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మీనారాయణ, కమిటీ సభ్యులు నాగరాజు, గ్రామ ప్రెసిడెంట్ మంత్రి రఘు, గ్రామ కమిటీ సభ్యులు హనుమంతు జనార్ధన్, గ్రామ ప్రధాన కార్యదర్శి చర్మ శ్రీకాంత్, షాపూర్ ప్రధాన కార్యదర్శి బాలరాజు, సూరారం డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, నాయకులు చంద్రగిరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన

**-కోలన్ హన్మంత్ రెడ్డి**



**టీ మీడియా, జూన్ 25,మేడ్చల్:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం125 డివిజన్ గాజులరామారం సీనియర్ కాంగ్రెస్ నాయకులు సిద్దనోళ్ల సంజీవ్ రెడ్డి కుమారుడు సిద్ధనోళ్ల మల్లారెడ్డి పుట్టినరోజు సందర్బంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోలన్ హన్మంత్ రెడ్డిని కలిసి ఆశీర్వాదం తీసుకోవడం జరిగింది. అనంతరం హన్మంతన్న శాల్వాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేసారు . ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు సిద్దనోళ్ల సంజీవ రెడ్డి , మాజీ కౌన్సిలర్ రంగారావు, 126 డివిజన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వేణు గౌడ్, భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

## కాంగ్రెస్ సేవాదళ్ ను విస్తృతం చేయాలి

**- ఎమ్మెల్యే కడియం శ్రీహరి**



**టీ మీడియా వరంగల్ బ్యూరో:** స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే, మాజీ ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి ని బుధవారం రోజున హనుమకొండ లోని ఎమ్మెల్యే గృహములో హనుమకొండ జిల్లా కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా అధ్యక్షులు బొచ్చుచందర్మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలనుప్రజలలోతీసుకెళ్లాలని బొచ్చు చందర్ కు సూచించారు. రానున్న స్థానిక ఎలక్షన్లలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి లను గెలిపించుటకు కృషి చేయాలని చెప్పారు. హనుమకొండ జిల్లాలో కాంగ్రెస్ సేవాదళ్ ను విస్తృతంగా ప్రచారం చేయాలని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు చిన్నాల గోనాద్, హనుమకొండ నియోజవర్గ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షులు తాళ్లపల్లి రాజు, కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా జనరల్ సెక్రెటరీ తాటికొండ ప్రసాద్, కాంగ్రెస్ సేవాదళ్ ఇన్స్పెక్టర్ పి. యాదగిరి, పరకాల నియోజకవర్గం ఎస్టీ సెల్ అధ్యక్షులు పాలకుర్తి శ్రీనివాస్, జల్లెల్ల కృష్ణమూర్తి, కొక్కిరాల తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

## బాల శివప్రసాద్ ను సన్మానించిన

**-విశ్వకర్మ సంక్షేమ సంఘం**



**టీ మీడియా, జూన్ 25, పెద్దపల్లి బ్యూరో** :కాల్వ శ్రీరాంపూర్ మండలం గంగారం గ్రామ శ్రీ విరాట్ విశ్వకర్మ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జర్నలిస్టు బాలే శివప్రసాద్ ను ఘనంగా సన్మానించారు. ఇటీవల పెద్దపల్లి జిల్లాలో జరిగిన టి యు డబ్ల్యూ జే జిల్లా కమిటీ ఎన్నికల్లో కాల్వ శ్రీరాంపూర్ మండల సూర్య దినపత్రికలో పనిచేస్తున్న జర్నలిస్ట్ శివప్రసాద్ జిల్లా ఉపాధ్యక్షులు గా ఎన్నికైన సందర్భంగా గంగారం గ్రామ విశ్వకర్మ సంక్షేమ సంఘం ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా శాలువా కప్పి స్వీట్లు తినిపించి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల సమస్యలను ప్రభుత్వానికి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరే విధంగా జర్నలిస్టులు పనిచేస్తారన్నారు. జర్నలిస్టు వృత్తి సమాజంలో వెలకట్టలేనిదని నిత్యం సమస్యలపై పరితపిస్తూ ప్రజలకు తెలిసే విధంగా కృషి చేస్తారన్నారు. బాలే శివప్రసాద్ సూర్య దినపత్రికలో పనిచేయడం అభినందనీయమని మరిన్ని పదవులు అధిరోహించి సదా ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వకర్మ సంక్షేమ సంఘం గ్రామ శాఖ అధ్యక్షులు ధరణి మణికంఠచారి, ఉపాధ్యక్షులు రంగు సదానందం, ప్రధాన కార్యదర్శి పోలోజు శ్రీనివాస్, సహాయ కార్యదర్శి శ్రీరామోజు వెంకటేశ్వర్లు, కార్యదర్శి సేపూరి కనుకాచారి, కోశాధికారి రావుల సంపత్ చారి, గౌరవ సలహాదారులు బొజ్జ వెంకటేశ్వర్లు, ధరణి బిక్షపతి, సభ్యులు మునిగంటి దేవేంద్ర చారి, కందుకూరి రాజన్న, సేపూరి రవీంద్ర చారి, కందుకూరి రవి కిరణ్, సేపూరి సుమన్, రంగు నారాయణ, రజక సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## విస్తృతంగా పర్యటించిన మంత్రి వివేక్ వెంకటస్వామి



**టీ మీడియా, జూన్ 25,మంచిర్యాల బ్యూరో** :చెన్నూర్మున్సిపాలిటీలో సుమారు 34 లక్షల రూపాయల నిధులతో చేసిన అభివృద్ధి పనులకు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన కార్మికశాఖ, మైనింగ్ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి. చెన్నూర్ పాత బస్ స్టాండ్ లోని అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళు లు అర్పించిన మంత్రి వివేక్ వెంకటస్వామి. అనంతరం రైతు భరోసా సంబురాల్లో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చిత్రపటాలకు పాలాభిషేకం చేసిన నాయకులు. చెన్నూర్ మండలంలోని సుబ్బరాంపల్లి, కిష్టంపేట గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గు పోసే కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి వివేక్ వెంకటస్వామి. తర్వాత భీమారంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో 66 లక్షల నిధులతో అదనపు డార్మెటరీ గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేసి ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేశారు. చెన్నూర్ నియోజకవర్గంలో 200 కోట్ల రూపాయల నిధులతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి నేను ఎమ్మెల్యేగా గెలుపొందిన తర్వాత మార్నింగ్ వాక్ లో సమస్యలు తెలుసుకొని అన్ని పూర్తి చేస్తున్నాను చెన్నూర్ మున్సిపాలిటీలో ప్రతీ వార్డుకు సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు పూర్తి చేయడం జరిగింది. 30 కోట్ల రూపాయల నిధులతో అమృత్ పథకం ద్వారా మంచి నీటి పంపిణీ చేస్తాము. ఈరోజు ఇందిరమ్మ ఇండ్ల భూమి పూజ చేయడం జరిగింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు అన్ని పథకాలను అమలు చేస్తున్నాము. ఇందిరమ్మ ఇండ్లు, ఉచిత బస్సులు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రైతు భరోసా నిధులు మంజూరు చేయడం జరుగుతుంది. 9 రోజుల్లో 9 వేల కోట్ల రూపాయల నిధులతో రైతు భరోసా ఇవ్వడం జరిగింది. రైతుల ఖాతాల్లో టింగ్ టింగ్ అని డబ్బులు జమ కావడం జరిగింది.

## విజిలెన్స్ కమిటీ సభ్యులకు సన్మానం

**-గద్వాల కృష్ణ**



**టీ మీడియా, జూలై 25, వనపర్తి బ్యూరో :** వనపర్తి జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవనం నందు బుధవారం మాదిగ ఉద్యోగుల సమైక్య జిల్లా కమిటీ అధ్యక్షులు బోరెల్లి వెంకటయ్య అధ్యక్షతన ఇటీవల నూతనంగా ఎన్నుకోబడిన జిల్లా ఎస్సీ /ఎస్టీ మానిటరింగ్ అండ్ విజిలెన్స్ కమిటీ సభ్యులు చింతకుంట విశ్వం బాబు, గౌరగల్ల వెంకటేశు, డి. వెంకటేష్ లను ఘనంగా పూల మాలలు, శాలువలతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసినటువంటి ఏ.ఐ.ఎం.ఈ.ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు గద్వాల కృష్ణ మాట్లాడుతూ నూతనంగా ఎన్నిక కాబడినటువంటి మాదిగ జాతి బిడ్డలు జిల్లాలోని 15 మండలాల్లో ఎస్సీ మరియు ఎస్టీల యొక్క సమగ్ర అభివృద్ధి వారి ఆత్మ గౌరవాన్ని అన్ని రంగాల్లో పెంపొందించే విధంగా కృషి చేయాలని కోరారు. అదే విధంగా సివిల్ రైట్స్ డే అన్ని మండలాల్లో అధికారులు నిర్వహించే విధంగా, దేవాలయాల ప్రవేశాలు లేనటువంటి గ్రామాల్లో ప్రజలను చైతన్యపరచి అందరము సమానమనే భావన కలిగించాలని కోరారు. జిల్లాల్లో ఎక్కడ కుల వివక్షతకు తావు లేకుండా అందరము సమానము అని భావనతో మెలిగే విధంగా ప్రజలను చైతన్య పరిచే బాధ్యత ఈ కమిటీ సభ్యుల పైన ఉందని తెలియజేశారు. కార్యక్రమంలో ప్రత్యేక ఆహ్వానితులుగా గొర్ల బాలరాం, గంధం గట్టయ్య , తగువుల వెంకటస్వామి, కేశపాక కేశవులుపాల్గొన్నారు తగువుల సివిల్ కుమార్, గంధం భగవంతు, గంధం దాస్, గద్వాల ఆంజనేయులు, పంచాయతీ రాజ్ సెక్రెటరీ చంద్రశేఖర్, కదిరే పహాడ్ రామకృష్ణ పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేసిన

**జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**




**టీ మీడియా,జూన్ 25, వరంగల్ బ్యూరో:** హనుమకొండ: హనుమకొండ జిల్లా దామెర మండల కేంద్రంలోని పీఎం శ్రీ ఎంపీపీ ఎస్ పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ బుధవారం తనిఖీ చేశారు. ముందుగా ప్రాథమిక పాఠశాలలోని తరగతి గదులను సందర్శించి అక్కడున్న ఉపాధ్యాయులు, విద్యార్థులతో జిల్లా కలెక్టర్ మాట్లాడారు. ఈ విద్యా సంవత్సరానికి గాను ఎంత శాతం విద్యార్థుల ఎన్ రోల్ మెంట్ అయిందని, కొత్త యూనిఫామ్స్ విద్యార్థులకు ఇచ్చారా, ఎంతమంది విద్యార్థులు హాజరయ్యారనే వివరాలను ప్రధానోపాధ్యాయులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమంలో పాఠ్యాంశాలు చెబుతున్నారా అని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఉన్నత పాఠశాలలోని 6, 9వ తరగతు లను కలెక్టర్ సందర్శించారు. విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడారు. పాఠశాల ప్రాంగణంలోని మధ్యాహ్న భోజనం వంట గది వద్ద వంటలు కలెక్టర్ పరిశీలించారు. అక్కడే ఉన్న అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ చిన్నారుల హాజరు ను పరిశీలించి కేంద్రంలో అందిస్తున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడి కేంద్రంలోని చిన్నారులతో కొద్దిసేపు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పరకాల ఆర్డీవో డాక్టర్ కె.నారాయణ, స్థానిక తహసిల్దార్ జ్యోతి వరలక్ష్మి దేవి, ఎంఈవో రాజేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## నాపై నమోదైన
# కేసు కొట్టేయండి

**పూర్తి ఆధారాలతో నిర్ధారణకు**

ఘటన జరిగిన రోజు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ విలేకరుల సమావేశంలో వైఎస్ జగన్? మోహన్?రెడ్డి ర్యాలీలో ఉన్న వాహనం సింగయ్యను ఢీకొందని చెప్పి దాని నంబర్?ను ప్రస్తావించారు. అప్పటికి పూర్తిస్థాయిలో స్పష్టత లేకపోవడంతో ఎఫ్?ఐఆర్?లో మాత్రం గుర్తుతెలియని వాహనం ఢీకొందని పేర్కొంటూ కేసు నమోదు చేశారు. ఆదివారం వెలుగులోకి వచ్చిన వీడియోలో సింగయ్య జగన్ వాహనం కింద పడిన దృశ్యాలు స్పష్టంగా ఉండటంతో సీసీ కెమెరాలు, వీడియో ఫుటేజీలు, డ్రోన్ వీడియోలను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలించి పూర్తి ఆధారాలతో నిర్ధారణకు వచ్చారు.

## తెలంగాణ బోనాలకు...
# 600 ఏళ్ల చరిత్ర



### నెలంతా ఆధ్యాత్మిక శోభ

డిల్లం డల్లం కుడకలు బెల్లం అంటూ ఆదిపరాశక్తి అమ్మవారికి దీపంపెట్టి సాక పోసి సల్లగ సూడమని మొక్కులు చెల్లించుకుంటూ తెలంగాణాలో చేసే జాతర బోనాలు. హైదరాబాద్‌లో ఏటా ఆషాఢ మాసాన భక్తులు బోనాల జాతరను సంబరంగా నిర్వహిస్తుంటారు. ఇక ఈ ఏడాది పండుగ రానే వచ్చింది. గురువారం ఈ పండగ వేడుకలు ఆరంభం కానున్నాయి. ఆడబిడ్డలు ఎక్కించే బోనాలు అమ్మవారి సోదరులుగా భావించే పోతురాజులు చేసే విన్యాసాలు.. శివసత్తుల నృత్యాలు ఏనుగు అంబారీలు, తొట్టెల ఊరేగింపులు ఫలహార బళ్ల ప్రదర్శనలు ఇలా ఒకటేమిటి నెల రోజుల పాటు తీరొక్క వేడుకలే.

### వేడుకలకు సర్వం సిద్ధం

గురువారం గోల్కొండ కోటలోని జగదాంబిక-మహంకాళి అమ్మవారి ఆలయంలో బోనాల వేడుకలు ప్రారంభం కానుండగా జులై 13న సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళీ అమ్మవారి ఆలయంలో బోనాలు జరగనున్నాయి. వీటినే లష్కర్ బోనాలు అంటారు. జులై 21న లాల్‌దర్వాజ సింహవాహినీ మహంకాళీ ఆలయంలో జరిగే రంగం వేడుకలతో నగరంలో బోనాల వేడుకలు ముగుస్తాయి. ఉత్సవాల సందర్భంగా ఈ ఆలయాల పేర్లు ప్రధానంగా వినిపించినా హైదరాబాద్‌లోని అన్ని అమ్మవార్లు, గ్రామ దేవతల ఆలయాల్లో వివిధ రకాల పూజలు, అర్చనలు జరుగుతూ నెలంతా ఆధ్యాత్మిక శోభ వెల్లివిరుస్తూ ఉంటుంది.

### గోల్కొండ కోటలో బోనాల సంబరాలు

బోనం అంటే పసుపు, కుంకుమ, వేపాకులతో అలంకరించిన కుండలో అమ్మవారికి నైవేద్యంగా సమర్పించే అన్నం, బెల్లం. అమ్మవారికి బోనం నైవేద్యం సమర్పణను తెలంగాణలో వివిధ నెలల్లో ఓ పండుగలా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా పలు రకాల పూజలు నిర్వహిస్తారు. ముఖ్యంగా ఎక్కడెక్కడి వలస జీవులనో తన అక్కున చేర్చుకున్న హైదరాబాద్‌లో బోనాల సంబరాలు ఆషాఢమాసంలో జరుగుతాయి. గోల్కొండ కోటలో కొలువైన శ్రీ జగదాంబ మహంకాళి అమ్మకు తొలిబోనం సమర్పించటం ఆనవాయితీ. ఆషాఢ మాసంలోని తొలి గురు లేదా ఆదివారాల్లో గోల్కొండ కోటలో బోనాల సంబరాలు షురూ అవుతాయి. గురువారం జరిగే ఈ కార్యక్రమానికి సర్వం సిద్ధమైంది.

### అమ్మవారి కోసం బంగారు బోనం

గోల్కొండ జగదాంబికా అమ్మవారికి తొలిరోజు మూడు బోనాలను సమర్పిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం సమర్పించే పట్టుచీర, బోనాలను లంగర్‌హౌస్ నుంచి ఊరేగింపుగా తీసుకువెళ్తారు. ముందుగా లంగర్‌హౌస్‌లోని పూజారి ఇంటి వద్ద ఉండే ఉత్సవ విగ్రహాలకు పట్టు వస్త్రాలను సమర్పిస్తారు. అనంతరం ఉత్సవ విగ్రహాలు, బోనాలను కోటపైకి డప్పు చప్పుళ్లు, డోలు మోతలు పోతరాజుల విన్యాసాల నడుమ ఊరేగింపుగా తీసుకువస్తారు. అక్కడ ఘటాలకు ప్రత్యేక పూజలు చేసి బోనాలను సమర్పిస్తారు. ప్రభుత్వం ఇచ్చే బోనాలతో పాటు బంజర్ దర్వాజ నుంచి నజర్ బోనం తీస్తారు. మహంకాళి ఆలయ పూజారి ఇంటి నుంచి మరో బోనం అమ్మకు వెళ్తుంది. ఇలా తొలి రోజు మూడు ప్రధాన బోనాలు అమ్మకు చెల్లిస్తారు. ఈ సారి ప్రత్యేకంగా అమ్మవారి కోసం బంగారు బోనాన్ని తయారు చేయించినట్లు మహంకాళి ఆలయ పూజారి తెలిపారు. కాకతీయ రాజుల నుంచి బోనాలు పండుగ చేస్తున్నారు. తరువాత గోల్కొండను పరిపాలించిన నిజాం నవాబులు బోనాలు సమర్పించారు. మా తాతలు, ముత్తాతల నుంచి బోనాలు పండుగ చేస్తున్నారు." సాయిబాబా చారి, గోల్కొండ మహంకాళి ఆలయ పూజారి

### నిజాం నవాబులు సంప్రదాయాన్ని

ఆషాఢ మాసంలో గోల్కొండ జగదాంబిక అమ్మవారికి తొమ్మిది బోనాలు సమర్పిస్తారు. ప్రతి గురు, ఆదివారాల్లో ఈ కార్యక్రమం ఉంటుంది. ఆషాఢమాసం ముందు అమావాస్య రోజున గోల్కొండ ఆలయానికి వెళ్లే మార్గంలోని మెట్లకు మహిళలు పూజలు నిర్వహిస్తారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. గోల్కొండ బోనాల జాతరకు దాదాపు వెయ్యి ఏళ్ల చరిత్ర ఉందని చరిత్రకారులు చెబుతుంటారు. హైదరాబాద్ నగరం ఏర్పడక ముందు ఈ ప్రాంతంలో రామ్‌దేవ్ రావు అనే వ్యక్తి పశువులు కాస్తుండగా, అమ్మవారి విగ్రహం దొరికిందని ప్రతీతి. ఆ విషయం అప్పటి కాకతీయ రాజులకు తెలిసి, ఇక్కడ చిన్న ఆలయాన్ని కట్టించి అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్టించారని చెబుతారు. అంతేకాదు కాకతీయ రాజు ప్రతాప రుద్రుడు ఆలయంలో బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారని చెబుతారు. అప్పటి నుంచి ఏటా ఇక్కడ బోనాల ఉత్సవాలు జరుగతున్నాయని భక్తుల విశ్వాసం. కాకతీయుల తర్వాత ఈ ప్రాంతాన్ని పాలించిన నిజాం నవాబులు కూడా ఆ సంప్రదాయాన్ని కొనసాగించారని ప్రతీతి. పట్టు వస్త్రాలు సమర్పించనున్న పొన్నం ప్రభాకర్ : గోల్కొండ కోటలో ఆషాఢ మాసంలోని ప్రతి గురు, ఆది వారాల్లో జరిగే బోనాల వేడుకల్లో భాగంగా ఏటా వేలాది మంది భక్తులు పాల్గొని అమ్మకు ఒడి నింపుతారు. బోనాలు సమర్పించి తమను చల్లగా చూడాలని మొక్కుతారు. బోనాల వేడుకల ప్రారంభం సందర్భంగా గురువారం ప్రభుత్వం తరపున అమ్మవారికి స్పీకర్ గడ్డం ప్రసాద్, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, హైదరాబాద్ ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌లు పట్టు వస్త్రాలు సమర్పిస్తారు.

### ఆలయాల్లో బోనాల ఉత్సవాలు

తెలంగాణలో బోనాల ఉత్సవాలకు ఎంతో చారిత్రక ప్రాశస్త్యం ఉంది. 600 ఏళ్ల క్రితం శ్రీకృష్ణ దేవరాయలు ఏడుకోళ్ల నవదత్తి ఆలయాన్ని నిర్మించి బోనాలు సమర్పించుకున్నారని చరిత్రకారులు చెబుతారు. ఇక 1676లో సర్వాయి పాపన్న కరీంనగర్ లో ఎల్లమ్మ గుడిని కట్టించి అమవారికి బోనాలు సమర్పించారని ప్రతీతి. గోల్కొండ కోట కాకతీయుల ఆధీనంలో ఉన్న రోజుల నుంచే బోనాలు ఉన్నాయని ఆ తర్వాత గోల్కొండను జయించిన కులీ కుతుబ్ షా, బాదూషా సైతం సంప్రదాయాన్ని కొనసాగించారని చెబుతారు. తానీషా పాలనలో అక్కన్న మాదన్నల ఆధ్వర్యంలో గోల్కొండ కోట మొదలు హైదరాబాద్‌లోని అమ్మవార్లు, గ్రామదేవతల ఆలయాల్లో బోనాల ఉత్సవాలు వైభవంగా సాగేవని ప్రతీతి.

### జాతర నెల రోజులు పుర వీధులు కళకళ

తెలంగాణ ప్రజల జీవన విధానంలోనే ప్రకృతికి, పండుగకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఆషాఢంలో జరిగే బోనాలు, దసరా సమయంలో జరిగే బతుకమ్మ పండుగలు ఇందుకు చక్కని ఉదాహరణ. బోనాల పండుగ సందర్భంగా గ్రామ దేవతలను పూజిస్తారు. ఈ వేడుకల్లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న భాగ్యనగర బోనాల సంబరాలను చూసేందుకు రాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాలు, పలు దేశాల నుంచి సైతం భారీగా భక్తులు తరలివస్తుంటారు. గోల్కొండ మొదలు లష్కర్, లాల్ దర్వాజల్లో జరిగే పసుపు బోనాల సంబురాలను నిలువెల్లా కళ్లుగా చూసి ఆనందంతో పరవశిస్తుంటారు. జాతర నెల రోజులు పుర వీధులు కళకళలాడుతుంటాయి. ఇల్లిళ్లు పచ్చని వేపాకులతో పసుపు గడపలతో ఇంటి ఆడపడులు, పిల్లా పాపలతో కళకళలాడుతాయి.

## గర్భిణులు, వృద్ధులకు...
# ఆటో ఫ్రీ



- తరచూ అన్నదానాలు
- ట్రాన్స్‌జెండర్ అనీ ఎందరికో ఆదర్శం!

**టి మీడియా, జూన్ 25,రాయచూర్:** ఆటోఎక్కనివ్వలేదని నాలుగు ఆటోలను కొనేసింది- అవమానాలతో రగిలి, సేవాభావంతో వెలుగుతున్న అనీ మంగళూర్- గర్భిణులు, వృద్ధులు, ట్రాన్స్‌జెండర్లకు అనీ ఆటోల్లో ఫ్రీ జర్నీ- యాక్టర్, జిమ్ ట్రైనర్‌గానూ రాణిస్తున్న వైనం. ఆమె ఒక ట్రాన్స్‌జెండర్. అయితేనేం మనిషే కదా. రోజూ సాయంత్రం ఇంటికి వెళ్లే క్రమంలో నరకయాతన అనుభవించేది. ఆమెను చూసి ఆటో డ్రైవర్లు ఆటోలను ఆపకుండానే వెళ్లిపోయేవారు. రోజూ ఇలాంటి చేదు అనుభవమే ఎదురయ్యేది. దీంతో సదరు ట్రాన్స్‌జెండర్ నడుస్తూ ఇంటికి చేరుకునేది. అయితే ఈ అవమానం మిగిల్చిన బాధను తలచుకొని లోలోన కుమిలిపోయేది. తనలాంటి ట్రాన్స్‌జెండర్లతో పాటు గర్భిణులు, వృద్ధులకు అండగా నిలిచేందుకు అనీ మంగళూర్ ఏం చేసింది? జీవితంలో తన కాళ్లపై తాను ఎలా నిలదొక్కుకుంది? అనే వివరాలతో 'ఈటీవీ భారత్' ప్రత్యేక కథనమిది.

**అవమానం, బాధలను చూశాక...**

ఆమె పేరు అనీ మంగళూర్. కర్ణాటకలోని రాయచూర్ వాస్తవ్యురాలు. ఉన్నత విద్య కోసం మంగళూరుకు వచ్చింది. బీఏ డిగ్రీ కోర్సును పూర్తి చేసింది. ఆ తర్వాత బీఈడీలో చేరింది. రెండు సెమిస్టర్ల పరీక్షలు కూడా రాసింది. ట్రాన్స్‌జెండర్లకు విద్యారంగంలో పెద్దగా ఉపాధి అవకాశాలు లభించవని తెలియడంతో, బీఈడీ చదవడాన్ని మానేసింది. మంగళూరులోనే సెటిల్ అయిపోయిన అనీ జీవితంలోని చాలా దశల్లో, చాలా చోట్ల అవమానాలను ఎదుర్కొంది. ప్రత్యేకించి కాలేజీ నుంచి ఇంటికి తిరిగి వెళ్లేటప్పుడు ఆటోవాలాలు ఆటో ఆపనప్పుడు తన మనసుకు చాలా బాధ కలిగేదని ఆమె చెప్పుకొచ్చింది.



గత్యంతరం లేని పరిస్థితుల్లో తాను నడుస్తూ ఇంటికి చేరుకునే దానినని గుర్తుచేసుకుంది. ఈ అవమానం, బాధలను చూశాక అనీ మంగళూర్ ఒక సంకల్పం చేసుకుంది. డబ్బులు సంపాదించిన తర్వాత కనీసం ఒక ఆటోనైనా కొని ట్రాన్స్‌జెండర్లు, గర్భిణులు, వృద్ధులకు అండగా నిలవాలని డిసైడ్ అయింది.

**గర్భిణులు, పెద్ద వయస్కులు, ట్రాన్స్‌జెండర్లకు ఫ్రీ**

మొదటి నుంచీ అనీకి సమాజ సేవ చేయాలనే బలమైన కోరిక ఉండేది. అందుకే తాను సంపాదించిన డబ్బుకు తోడుగా బ్యాంకు లోన్ తీసుకొని నాలుగు ఆటోలను కొనేసింది. వాటిని మంగళూరులోని డెలారా కట్టె గ్రామానికి చెందిన నలుగురికి అద్దెకు ఇచ్చింది. వాటి ద్వారా ఆమెకు ప్రతినెలా ఫిక్స్‌డ్‌గా కొంత ఆదాయం వస్తోంది. అయితే అనీకి చెందిన ఆటో సర్వీసుల్లో సామాజిక సేవాభావం స్పష్టంగా కనిపిస్తుంది. గర్భిణులు, పెద్ద వయస్కులు, ట్రాన్స్‌జెండర్లు ఈ ఆటోల్లో ఫ్రీగా ప్రయాణించొచ్చు. ఈ విషయాన్ని తన ఆటోలను నడిపే వాళ్లందరికీ అనీ స్పష్టంగా చెప్పింది. దీంతోపాటు పేదలు, ఆస్పత్రుల్లోని రోగుల కోసం ఆమె అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తోంది.

**యాక్టర్, జిమ్ ట్రైనర్‌గానూ**

ఇంకొక విషయం ఏమిటంటే, అనీ మంగళూరు నటి కూడా. శివలీల అనే కన్నడ మూవీలో విలన్‌గా నటనతో అదరగొట్టింది. ఒక జిమ్‌లో ట్రైనర్‌గా పార్ట్ టైమ్ జాబ్ సైతం చేస్తోంది. టౌన్‌లో తిరిగేందుకు ఒక టూవీలర్‌ను కొనుక్కుంది. తద్వారా ట్రాన్స్‌జెండర్ అనే పదానికి కొత్త నిర్వచనాన్ని ఇచ్చేందుకు ఆమె ప్రయత్నిస్తోంది. ఆత్మగౌరవంతో జీవించాలనే కోరిక, స్వయం సమృద్ధి సాధించాలనే లక్ష్యం అందరిలాగే ట్రాన్స్‌జెండర్‌లకూ ఉంటాయని నిరూపిస్తోంది.

**సమాజ సేవతో ఎంతో ఆనందం!**

"నేను జీవితంలో చాలా అవమానాలను ఎదుర్కొన్నాను. అవే నాలో కసిని పెంచాయి. ఇంతటి స్థాయికి తీసుకొచ్చాయి. ఇప్పటికే కొన్ని సినిమాల్లో నటించాను. ఒక జిమ్‌లో ట్రైనర్‌గానూ వర్క్ చేస్తున్నాను. శ్రమను నమ్ముకొని బతుకుతున్నాను. నా కష్టార్జితంతో నాలుగు ఆటోలను కొని అద్దెకు ఇచ్చాను. వాటిలో గర్భిణులు, పెద్ద వయస్కులు ఉచితంగా ప్రయాణించొచ్చు. పేదల కోసం అన్నదాన కార్యక్రమాలను నిర్వహిస్తుంటాను. సమాజ సేవ చేస్తే చాలా ఆనందం కలుగుతుంది" అని ట్రాన్స్‌జెండర్ అనీ మంగళూర్ ఈటీవీ భారత్?కు చెప్పుకొచ్చింది.

**ట్రాన్స్‌జెండర్ల గౌరవాన్ని పెంచుతోంది**

"అనీకి పట్టుదల, ధైర్యం ఎక్కువ. జీవితంలో చాలా కష్టాలు, అవమానాలను చూసింది. అందుకే ఆమె బాగా శ్రమిస్తుంది. ఓ వైపు జిమ్ ట్రైనర్‌గా, మరోవైపు యాక్టర్‌గా, ఇంకో వైపు నాలుగు ఆటోలకు యజమానిగా, సామాజిక సేవకురాలిగా చాలా పాత్రలను అనీ పోషిస్తోంది. ట్రాన్స్‌జెండర్లకు సమాజంలో గౌరవాన్ని పెంచుతోంది. అందరూ ఆమెను మెచ్చుకుంటున్నారు" అని అనీ మంగళూర్ స్నేహితురాలు రేష్మా స్వాతి చెప్పుకొచ్చారు.

## సినీతారల ఫోన్ల
# ట్యాపింగ్



### -సీక్రెట్‌గా స్టేట్‌మెంట్లు

**టి మీడియా,జూన్ 25, హైదరాబాద్ బ్యూరో:** తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ కేసుపై విచారణ జోరుగా సాగుతోంది. ఇప్పటికే ఎవరి ఫోన్లు ట్యాప్ చేశారో క్లారిటీకి తెచ్చుకున్నారు. తమ ఫోన్లు ట్యాప్ అయ్యాయని వారికి తెలుసో లేదో కానీ.. ట్యాపింగ్ కు గురయినట్లుగా అనుమానం ఉన్న అందర్నీ పిలిచి స్టేట్‌మెంట్లుతీసుకుంటున్నారు. అయితే రాజకీయ నేతలు ఓకే..మరిసినీతారలసంగతేమిటి అన్న ప్రశ్న వస్తోంది. సినీతారల ఫోన్లను కూడా ట్యాపింగ్ చేశారని జోరుగా ప్రచారం జరుగుతోంది. స్వయంగా పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ కూడా ఫోన్ ట్యాపింగ్ తో సినీ తారల కుటుంబంలో చిచ్చు పెట్టారని ఆరోపించారు ఫోన్ ట్యాపింగ్ చేసే హక్కు కేసీఆర్, కేటీఆర్ కు ఎవరిచ్చారని.. ప్రైవసీని దెబ్బతీసే హక్కు ఎవరిచ్చారని ఆయన ప్రశ్నించారు. సినీ తారల ఫోన్ ట్యాపింగ్ జరిగి ఉంటే వారి వద్ద నుంచి కూడా స్టేట్‌మెంట్లు తీసుకోవాలి కదా అన్న సందేహం చాలా మందికి వస్తోంది. బీజేపీ నేతల నుంచి స్టేట్ మెంట్లు తీసుకున్నారు. కాంగ్రెస్ నేతల నుంచి తీసుకున్నారు. బీఆర్ఎస్ నేతల్ని కూడా బిలవబోతున్నారు. మీడియాలో.. వేమూరి రాధాకృష్ణ ఫోన్ కూడా ట్యాప్ అయినట్లుగా గుర్తించారు. ఆయన స్టేట్ మెంట్ కూడా రికార్డు చేస్తున్నారు. సమరి సినీతారలది ఎందుకు చేయడం లేదు ?. ఈ విషయంలో పోలీసులు గుంభనంగా వ్యవహరిస్తున్నారని.. ట్యాపింగ్ కు నెంబర్లను బట్టి వారి వద్ద సైలెంట్ గా స్టేట్ మెంట్లు తీసుకుంటున్నారు. తమ ఫోన్లు ట్యాప్ అయినట్లుగా బయటకు రావొద్దని.. వారుకోరుకుంటున్నట్లుగా తెలుస్తోంది. అయితే సాక్షుల వివరాలను కోర్టులో ప్రవేశ పెట్టినప్పుడయినా బయటకు రావడం ఖాయమని అనుకోవచ్చు.